## కొత్త చట్టంతో భూ వివాదాలు పరిష్కారం

● కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 18 : నూతన ఆర్ఓఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారాలను సరళతరం చేయడానికి దోహద పడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు, రైతు సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలకు సంబంధించిన భూ వివాదాల సత్వర పరిష్కారానికి 'భూ భారతి' అవగాహన సదస్సులు ఉపయోగపడతాయన్నారు. భూభారతి చట్టంలోని నిబంధనలపై అవగాహన తీసుకురావడానికి, సేవలను విస్తరించడానికి పౌరులు, రైతులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ముందుగా మండల స్థాయిలో ఈ నెల 19 నుంచి 26 వరకు ఈ అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా 19న మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో ఉదయం 10.30 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొనాలని కలెక్టర్ సూచించారు.

## మేడ్చల్‌లో గాలివాన



మేడ్చల్, ఏప్రిల్ 18 : మేడ్చల్‌లో శుక్రవారం సాయంత్రం గాలివాన కురిసింది. వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గాలి వీచి ఆ తర్వాత వాన ప్రారంభమైంది. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. హౌజింగ్ బోర్డుకాలనీలో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. వీధులు జలమయమయ్యాయి. కాగా వివేకానంద విగ్రహం సమీపంలో ఉన్న హోర్డింగ్ బ్యానర్ గాలికి ఊడి త్రీఫేజ్ లైన్‌పై పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, దానిని తొలగించారు.

# రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం..

● మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పిలుపు
● పీర్జాదిగూడలో చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

పీర్జాదిగూడ ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో జరగనున్న పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించతలపెట్టిన రజతోత్సవ మహాసభ వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే మల్లారెడ్డి, పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...16 నెలల కాంగ్రెస్ పాలనలో కరువు వచ్చింది.. నీళ్లు బంద్ అయ్యాయి.. కాంగ్రెస్ వచ్చింది కరెంటు పోయింది.. రియల్ ఎస్టేట్ కుప్పకూలి పోయిందన్నారు. కేసీఆర్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల మాయ మాటలను నమ్మి మోసపోయామని గ్రహించిన ప్రజలు ఇప్పుడు మళ్లీ కేసీఆర్, కేటీఆరే కావాలంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేశ్,దొంతిరి హరి శంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి,సీనియర్ నాయకుల రఘుపతిరెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, పార్టీ బోడుప్పల్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మనోరంజన్‌రెడ్డి, జావెద్‌ఖాన్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**బోడుప్పల్‌లో...**

బోడుప్పల్ : వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం వద్ద మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన వాళ్లకి మురికి గుంటలో పడ్డట్లయింది..: ఎమ్మెల్యే**

ఘట్ కేసర్ : బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినోళ్లకు మురికి గుంటలో పడ్డట్లయిందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి విమర్శించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ యంనంపేట్ చౌరస్తాలో బీఆర్ఎస్ రజోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి 10 ఏండ్లలో బంగారు తెలంగాణగా అభివృద్ధి పరిచి దేశంలోనే నెంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన కేసీఆర్ తమ నాయకుడిగా ఉండాలని ప్రజలు కోరుతున్నట్లు చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే హవా ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణను అన్నపూర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనన్నారు.


బోడుప్పల్‌లో రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందన్నారు. తాగ్యు, సాగునీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి మడమ తిప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలలోకి వెళ్లలేక మొఖం చాటేసే పరిస్థితి నెలకొందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు తరిమి కొట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సభను విజయవంతం చేయండి : అల్వాల్ కార్పొరేటర్**

నేరేడ్‌మెట్ : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అల్వాల్‌లోని మాజీ ఎమ్మెల్యే చింతల కనకారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. వరంగల్ సభకు గులాబీ సైనికులంతా దండుగా బయలుదేరాలన్నారు. అదేవిధంగా వెంకటాపురంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో డివిజన్ కార్పొరేటర్ సబితాకిశోర్ మాట్లాడారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు లడ్డు, యాదగిరిగౌడ్, చంద్రశేఖర్, శరన్, గిరి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నేరేడ్‌మెట్ :సమావేశంలో మాట్లాడుతున్న అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

**రజతోత్సవ సభకు సమాయత్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు**

పోచారం : వరంగల్‌లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఆ పార్టీ పోచారం మున్సిపాలిటీ నాయకులు సమాయత్తం చేస్తున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశం అనంతరం పోచారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు మందాడి సురేందర్‌రెడ్డి, మాజీ చైర్మన్ కొండల్‌రెడ్డి, మరికొంత మంది మాజీ కౌన్సిలర్లు వార్డుల వారీగా ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఫోన్లలో మాట్లాడారు. వరంగల్ సభకు భారీ ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డు నుంచి పెద్ద ఎత్తున ప్రజలు,కార్యకర్తలను తరలించేందుకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.


నేరేడ్‌మెట్ : కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటాపురం కార్పొరేటర్ సబితాకిశోర్

## ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకు సేవలందిస్తా..: ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్ : గొంతులో ప్రాణం ఉన్నంత వరకు మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తూనే ఉంటానని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ యంనంపేట్ చౌరస్తాలో మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం,మజ్జిగ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారం ఇచ్చి అందలం ఎక్కించి ఎనలేని గౌరవాన్ని అందించిన మేడ్చల్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి, పార్టీ ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, పోచారం మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ బీ.కొండల్ రెడ్డి, ఘట్‌కేసర్ మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, అనూరాధ, జహంగీర్,నర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించి బీఆర్ఎస్ నాయకులకు మజ్జిగ అందిస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

## పేదలకు వరం.. సీఎం సహాయ నిధి

● మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి


బాధితురాలు నాగలక్ష్మికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 18: ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ యంనంపేట్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మారుతీనగర్ చెందిన నాగలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.14,500 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. పేదలకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికంగా ఆదుకుంటుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి



నేరేడ్‌మెట్, ఏప్రిల్ 18 : వెంకటాపురం డివిజన్ పరిధి టెలికామ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రమణారెడ్డి, కుముదదేవి, సంజయ్, ప్రమోద్ కుమార్, బ్రహ్మాచారి, సురేశ్ తదితరులు ఉన్నారు.




## వేసవిలో ప్రతి ఒక్కరి దాహార్తిని తీర్చాలి : రాగిడి


ఉప్పల్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ ఉప్పల్ డివిజన్ నాయకుడు పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఉప్పల్ విద్యుత్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాగిడి మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ సీనియర్ నాయకులు ఉమారెడ్డి, సంతోశ్, మహేందర్‌రెడ్డి, సాయి, జగన్, రంగ భాస్కర్, ప్రభాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు


సూర్యనగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్, ఏప్రిల్ 18 : డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో రోడ్ నంబరు-3లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీ పైపులైన్‌ను మరో 40 మీటర్లు పొడిగించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ త్వరలోనే 40 మీటర్ల డ్రైనేజీ పైపులైన్ పొడిగించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు కోతి యాదగిరిగౌడ్,నర్సింగరావు, నాగేశ్వర్‌రావు, చిన్న, శీలం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వారాహి ప్రత్యంగిరా బ్రహ్మోత్సవాలు



నేరేడ్‌మెట్, ఏప్రిల్ 18 : మల్కాజిగిరి సర్దార్ పటేల్ నగర్‌లోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ పాలిత శ్రీ వారాహి ప్రత్యంగిరా సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం అభిషేకం, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ సభ్యులు రామకృష్ణ, లక్ష్మణరావు, రాములు, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, దీపక్, మహిళా మండలి సేవా సభ్యులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే




మేడ్చల్, ఏప్రిల్ 18 : మేడ్చల్ పట్టణంలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉమానగర్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చి, ఎన్జీవోస్ కాలనీలో ఉన్న సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దలు క్రీస్తు సందేశాన్ని చదివి వినిపించారు. కేఎల్ఆర్ వెంచర్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్రీస్తు సిలువతో ఊరేగింపు నిర్వహించారు, కార్యక్రమంలో మత పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

## బొజ్జ యాదగిరికి దళిత రత్న అవార్డు



ఉప్పల్, ఏప్రిల్ 18 : వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను శుక్రవారం దళిత జన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జ యాదగిరి మర్యాదపూర్వకంగా కలిశారు. అంబేద్కర్ జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్య క్రమంలో అవార్డులు ప్రదానం చేసింది. దళిత జన సమితి అధినేత బొజ్జ యాదగిరికి దళిత రత్న అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మంత్రిని కలిశారు. కార్యక్రమంలో డీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె సంపత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ రమేశ్, సీనియర్ నాయకులు గంధమల్ల క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ సైన్స్‌లో ప్రభాదేవికి డాక్టరేట్



సికింద్రాబాద్, ఏప్రిల్ 18: ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుంచి ఐటీ విభాగంలో చెరుకు ప్రభాదేవి డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ వీబీ నరసింహ పర్యవేక్షణలో 'ఐడెంటిటీ అండ్ యాక్సెస్ మేనేజ్‌మెంట్ ఇన్ పబ్లిక్ క్లౌడ్ ఫ్రేమ్ వర్క్స్' అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను ప్రభాదేవికి ఉస్మానియా యూనివర్సిటీ గెజిట్ ద్వారా డాక్టరేట్ ప్రకటించారు. చిన్ననాటి నుంచే చదువులో చురుకుగా ఉండే ప్రభాదేవి ఉన్నత ఆశయంతో పీహెచ్‌డీలో ప్రవేశం పొంది తన లక్ష్యాన్ని పూర్తి చేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామానికి చెందిన ప్రభాదేవిది వ్యవసాయ కుటుంబం. తండ్రి చెరుకు సోమయ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్. తల్లి కలమ్మ గృహిణి. డాక్టరేట్ సాధించడం పట్ల ప్రభాదేవిని అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

# అందని వేతనాలు.. పంచాయతీ కార్మికుల ఆందోళన

● నిరసనలకు దిగిన కార్మికులు
● గ్రామాల్లో అధ్వానంగా మారిన పారిశుధ్యం
● నీళ్లు రాక ప్రజల ఇక్కట్లు

మేడ్చల్, ఏప్రిల్ 18 : వేతనాలు అందక పంచాయతీ కార్మికులు ఆందోళన బాట పట్టారు. వేతనాల కోసం ఎదురు చూస్తూ వస్తాయనే నమ్మకం సన్నగిల్లడంతో పనులు మాని నిరసనలకు దిగారు. మేడ్చల్ నియోజకవర్గంలోని 61 పంచాయతీల్లో మొదట 33 పంచాయతీలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అయితే విలీనం కాకుండా ఉన్న పంచాయతీల్లోని కార్మికులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

**నెలల తరబడి వేతనాలు అందక వెతలు**

మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్, కీసర మండలాల్లోని 33 పంచాయతీలను సమీప మున్సిపాలిటీలైన మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, పోచారం, నాగారం, దమ్మాయిగూడల్లో విలీనం చేశారు. అయితే విలీనం అయిన గ్రామపంచాయతీల కార్మికులకు వేతనాలకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ ఆ తర్వాత ఎల్లంపేట, ఆలియాబాద్, మూడుచింతలపల్లిలను కొత్త మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ మిగిలిన 28 పంచాయతీలను విలీనం చేస్తున్నట్టు ప్రభుత్వం వద్ద ప్రతిపాదన ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు వార్తలు వెలువడ్డాయి. అయితే అధికారంగా నిర్ణయం మాత్రం వెలుపడలేదు.

**ఆందోళనల బాట**

మున్సిపాలిటీల్లో విలీనమైన పంచాయతీల్లోని కార్మికులు వేతనాలు ఇబ్బంది లేకపోయినప్పటికీ మిగిలిన పంచాయతీల్లో రెండు నుంచి ఆరు నెలల వరకు వేతనాలు రాకపోవడంతో ఆందోళన బాట పట్టారు.



నూతన్‌కల్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

మేడ్చల్ మండలం నూతన్‌కల్‌లో ఆరు నెలలుగా వేతనాలు రాక పంచాయతీ కార్మికులు పనులు మాని, పంచాయతీ కార్యాలయంలో వంటావార్పుతో నిరసన తెలుపుతున్నారు. ఎల్లంపేటలో నాలుగు నెలలుగా వేతనాలు రాలేదు. వారు పనులు మానేసి, ఆందోళన బాట పట్టారు. అలాగే డబిల్‌పూర్, శ్రీరంగవరం, బండమాదారం, రాజబొల్లారం, రావల్‌కోల్, రావల్‌కోల్ తండా, రాజబొల్లారం తండా పంచాయతీల్లో వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు.

శామీర్‌పేట, మూడుచింతపల్లి మండలాల్లోని పంచాయతీల్లో ఆలియాబాద్‌లో 3, లాల్‌గడీమలక్‌పేటలో 4, మజీద్‌పూర్‌లో ఐదు, లక్ష్మాపూర్‌లో మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు ఆందోళన చేస్తున్నారు.


నూతనకల్‌లో వంటావార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

**తలెత్తుతున్న సమస్యలు**

వేతనాలు రాక పంచాయతీ కార్మికులు ఆందోళనకు దిగి, పనులను మానేశారు. దాంతో గ్రామాల్లో పారిశుధ్యం, నీటి సమస్యలు తలెత్తుతున్నాయి. వీధుల్లో చెత్త దర్శనమిస్తున్నది. సరఫరా చేసే వారు లేక నల్లాల్లో నీళ్లు రావడం లేదు. దీంతో ప్రజలు నీళ్ల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆలియాబాద్, లాల్‌గడీమలక్‌పేట తదితర పంచాయతీల్లో ఇప్పటికే నీటి కోసం ఆందోళన చేస్తున్నారు. కొన్ని రోజుల్లో మిగితా పంచాయతీల్లో కూడా పారిశుధ్యం, డ్రైనేజీ, మంచినీళ్ల సమస్యలు తలెత్తతున్నాయి.


నూతన్‌కల్‌లో రోడ్డుపై దర్శనమిస్తున్న చెత్త

## గ్రామాల్లో తాగునీటికి అల్లాడుతున్న జనం

● అలియాబాద్‌లో కాంగ్రెస్ నాయకులను హెచ్చరిస్తూ మెసేజ్

శామీర్‌పేట, ఏప్రిల్ 18 : తాగునీటి సమస్యతో గ్రామాలు అల్లాడుతున్నాయి. కండ్ల ముందు నీరు ఏరులైపారుతున్నా తాగడానికి గుక్కెడు లేక ప్రజలు గొంతెండుకుపోయే పరిస్థితి వచ్చింది. పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో దాదాపు 15 రోజులుగా వారు సమ్మెకు దిగడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. నీళ్ళు వదిలేవారు లేక తాగడానికి నీరు దొరకని పరిస్థితి నెలకొంది.శుక్రవారం అలియాబాద్‌లో మహిళలు తాగునీటి కోసం మినీ ట్యాంకుల వద్ద పడిగాపులు కాశారు.

**కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమంటూ వాట్సాప్‌లో హెచ్చరిక**

గత 15 రోజులుగా మేడ్చల్ జిల్లా అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ప్రాంతాల్లో 15 రోజులుగా పంచాయతీ కార్మికుల సమ్మె దిగడంతో గ్రామాల్లో పారిశుధ్యం పడకేకడంతో పాటు నీటి సమస్య తీవ్రతరమైంది. ఈ తరుణంలో అలియాబాద్ గ్రామంలో పలువురి వాట్సాప్ గ్రూపుల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పనితీరు, కాంగ్రెస్ నాయకులను హెచ్చరిస్తూ చేసిన మెసేజ్ హల్‌చల్ చేస్తున్నది.

'సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మార్పు మార్పు అని చెప్పి ఈరోజు గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు ఇవ్వలేని స్థితిలోకి వచ్చింది. గ్రామాల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయింది. తాగునీళ్లు అందించే వారు లేక ప్రజలు తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామంలో తిరగనివ్వమని' పేర్కొంటూ ''గురుక కుమార్ యాదవ్ మాజీ సర్పంచ్'' అనే మెసేజ్ ఒకటి అలియాబాద్ గ్రామంలో వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నది.


ఆలియాబాద్‌లో ట్యాంకువద్ద ఖాళీ బిందెలతో నీటి కోసం ఎదురు చూస్తున్న మహిళలు

## తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకోరా!


అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో వాటర్‌ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

పోచారం,ఏప్రిల్18 : ప్రతిరోజు వాటర్‌ట్యాంక్ నుంచి తాగునీరు వృథాగాపోతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకున్న పాపాన పోవడం లేదు. నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. పోచారం మున్సిపాలిటీ లక్ష్మీనర్సింహ కాలనీలోని ట్యాంక్ నుంచి ప్రతిరోజు ట్యాంక్ నిండి నీరు కిందకు వృథాగా పోతున్నది. ఒక్కోసారి గంటల తరబడి నీరు కిందపడి వృథా అవుతుంది. అంతేకాంకుడా ట్యాంక్ పక్కనే ఉన్న అంగన్‌వాడి భవనంపై పడి పిల్లలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు కల్పించుకొని వాటర్‌ట్యాంక్ నుంచి నీరు వృథా కాకుండా ట్యాంక్ పైనుంచి కింది వరకు పైప్‌ను ఏర్పాటు చేయాలని, నీరు అంగన్‌వాడీ భవనంపై పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు, అంగన్‌వాడీ నిర్వాహకులు కోరుతున్నారు.

**PUBLIC NOTICE**

It is hereby informed to the General public that my Client **Sri G.Karunakar Goud, S/o. Late Bala Goud** entered into an Agreement of Sale in respect All that House bearing No. 22- 824/A/1 (with PTI No. 1264141101) under Gramakantam on a Land admeasuring 400 Sq.yards or 334.4 Sq.Mtrs., consisting of Two Rooms and Bath Room with ACC, situated at Nethaji Defense Colony, Chennapuram Village under Jawahar Nagar Municipal Corporation, Kapra Mandal, Medchal-Malkajgiri District, Telangana State with Sri Siripireddy Bhaskar Reddy, S/o. Siripireddy Tathi Reddy and paid substantial amount as advance sale consideration. if any person or persons having any claim, interest or any right in respect of above said property are hereby requested to make known to the same in writing to the under singed with documentary evidence in support thereof with in 7 days from the date of publication hereof, failing which such claims/or objections, if any, shall be considered as waived and or discharged forever.

**SCHEDULE OF PROPERTY**

All that House bearing No. 22-824/A/1, under Gramakantam on a Land admeasuring 400 Sq.yards or 334.4 Sq.Mtrs., consisting of Two Rooms and Bath Room with ACC Roofing, situated at Nethaji Defense Colony, Chennapuram Village under Jawahar Nagar Municipal Corporation, Kapra Mandal, Medchal-Malkajgiri District, Telangana State and **bounded by: North:** 20' wide Road, **South:** House of Venkatesh, **East:** House of Obul Reddy, **West:** House of Laxminarayana.

**Sd/- M/s. J.RAMA KRISHNA, A.HUSSAIN, Advocates**
H.No. 48-19, Rami Reddy Nagar, Quthbullapur Municipal Circle and Mandal, GHMC, Medchal-Maikajgiri District, **Ph: 9440168144, 8519868154.**